అసదుద్దీన్ ఓవైసీ ప్రచారం



అభ్యర్థితో కలిసి ప్రచారం చేస్తున్న ఓవైసీ

రాజేంద్రనగర్: సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని బస్తీల్లో మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఎంఐఎం అభ్యర్థి స్వామియాదవ్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. పతంగి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అసదుద్దీన్ పాదయాత్ర నేపథ్యంలో స్థానిక ప్రాంతాలకు చెందిన మజ్లిస్ పార్టీ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

హడావిడిగా వీధి దీపాల ఏర్పాటు

అత్తాపూర్: కేటీఆర్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో యుద్ధ ప్రాతిపాదికన స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా వీధి లైట్లు లేక ఆయా ప్రాంతాల్లో స్థానిక ప్రజలు అంధకారంలోనే గడుపుతున్నారు. సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొంటారు. గత కొన్నేళ్లుగా వీధి లైట్లను ఏర్పాటు చేయాలని స్థానికులు పలుసార్లు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ప్రజా ప్రతినిధుల పర్యటన సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయడం గమనార్హం.

బోరు నీళ్లే దిక్కు !

- తడిసిమోపెడవుతున్న మిషన్ భగీరథ నీటి బిల్లులు
- ఆరు నెలలుగా సరఫరా బంద్
- పట్టించుకోని సంబంధిత అధికారులు

శంషాబాద్ రూరల్: ప్రతి ఇంటికి రక్షిత నీటి సరఫరా కోసం అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకం గ్రామస్తులకు ఎండమావిగానే మిగిలిపోతోంది. హైదరాబాద్ మహానగరం శివారు.. అంతర్జాతీయ విమానాశ్రయం పక్కనే ఉన్న గ్రామాల్లో నెలకొన్న ఈ దుస్థితిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శంషాబాద్ రూరల్ : మండలంలోని నాలుగు పంచాయతీల పరిధిలో గత ఆరు నెలలుగా బోరు నీళ్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది. బహదూర్‌గూడ, హమీదుల్లానగర్, చిన్నగోల్కొండ, రషీద్‌గూడ పంచాయతీలు, వీటి అనుబంధ గ్రామాలైన లక్ష్మి తండా, పోశెట్టిగూడ, సంఘీగూడలో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. ఔటర్ లోపల ఉన్న ఈ గ్రామాలకు హైదరాబాద్ మెట్రో నీటి సరఫరా విభాగం నుంచి నీటిని అందిస్తున్నారు. ఈ సరఫరాకు సంబంధించిన బిల్లులు రూ.లక్షల్లో పేరుకుపోవడం, ఇంత మొత్తంలో చెల్లించడానికి పంచాయతీల్లో ఖజానా లేకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గత ఆరు నెలలుగా కేవలం బోరు నీళ్లను మాత్రమే సరఫరా చేస్తున్నారు.

ఎందుకీ వ్యత్యాసం..

మండల పరిధిలోని మిగతా గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని రూరల్ వాటర్ సరఫరా విభాగం నుంచి సరఫరా అవుతుండగా.. వీటికోసం నామమాత్రము బిల్లులు వసూలు చేస్తున్నారు. ఔటర్ లోపల ఉన్న గ్రామాల్లో మాత్రం హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి నీటి సరఫరా చేస్తున్నారు. దీనికి గాను ఒక నల్లాకు నెలకు రూ.వేయి బిల్లు జారీ అవుతున్నాయి.

రూ. లక్షల్లో బిల్లుల జారీ..

నెలకు రూ. లక్షల బిల్లులు పంచాయతీలకు జారీ చేస్తుండటంతో వాటిని చెల్లించలేక వదిలేశారు. ఇంత పెద్ద మొత్తంలో బిల్లులు ఇవ్వడం మా వల్ల కాదంటూ పంచాయతీలు చేతులెత్తేశాయి. దీంతో కేవలం బోరు నీళ్లనే సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కాకున్నా.. కొంత మందికి నీటి బిల్లులు చెల్లించాలని ఫోన్లకు మెసేజ్‌లు పంపుతున్నారు. నీటి సరఫరా కూడా నిలిచిపోయింది.



చిన్నగోల్కొండలో నిరుపయోగంగా మిషన్ భగీరథ నీటిట్యాంకు

కరెంటు బిల్లుల మోత..

బోరు నీళ్ల సరఫరాతో పంచాయతీలకు కరెంటు బిల్లుల మోత మోగుతోంది. ఒక్కో పంచాయతీకి బోరు మోటార్లు, వీధి దీపాల కరెంటు బిల్లులు రూ.50 వేలకు పైగా వస్తుండటంతో ఖజానా ఖాళీ అవుతోంది. ప్రత్యేక ఆదాయ వనరులు లేని పంచాయతీలకు కరెంటు బిల్లులు పెద్ద గుదిబండగా మారాయి. ఇదిలా ఉండగా.. మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి.

ఇంటింటికి నీటి సరఫరా ఎక్కడా..?

మిషన్ భగీరథ పథకంలో గ్రామాల్లో ప్రత్యేకంగా ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్ ఏర్పాటుతో పాటు ఇంటింటికి నల్లాలు బిగించారు. కాని హెచ్ఎండబ్ల్యూఎస్ పరిధిలోని గ్రామాల్లో ట్యాంకులు నిర్మించి, పైపులు వేశారు. ఇంటింటికి నల్లాలు బిగించలేదు. నల్లాల ఏర్పాటుకు రూ. వేయి చొప్పున రుసుము చెల్లించాలని మెలిక పెట్టడంతో జనంతో పాటు పంచాయతీ పాలకవర్గం కూడా మిన్నుకుండిపోయారు. ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేసిన తర్వాత నీటి బిల్లులు ఇస్తామన్నా.. హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారుల్లో చలనం లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హమీదుల్లానగర్‌లో..

ఇక్కడ త్రీఫేజ్ రెండు బోర్లు, సింగిల్ ఫేజ్ రెండు బోర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. గతంలో రోజు విడిచి రోజు లక్ష లీటర్ల సురక్షిత నీటి సరఫరా జరిగేది. దీని కోసం రూ.6 లక్షల బిల్లు జారీ చేశారు. వీటిని చెల్లించలేక పంచాయతీ నుంచి బోరు మోటార్లతో నీటి సరఫరా చేపట్టారు.

చిన్నగోల్కొండలో..

చిన్నగోల్కొండలో త్రీఫేజ్ మోటార్లు నాలుగు, సింగిల్ ఫేజ్ మోటార్లు 3, సంఘీగూడలో త్రీఫేజ్ మోటార్లు రెండింటితో నీటి సరఫరా చేస్తున్నారు. ఇక్కడ బోరు మోటార్లు, వీధి దీపాలకు నెలకు రూ.70వేల బిల్లులు వస్తున్నాయి. మిషన్ భగీరథ నీటి బిల్లులు రూ.63 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.

రషీద్‌గూడలో..

రషీద్‌గూడలో త్రీఫేజ్ మోటారు ఒకటి, పోశెట్టిగూడలో రెండు బోరు మోటార్లతో నీటి సరఫరా చేపట్టారు.

బహదూర్‌గూడలో..

ఈ పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సుమారు 50 ఇళ్లకు మాత్రమే మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. గ్రామంలోని మిగతా ఇళ్లు, లక్ష్మీతండాలో నీటి సరఫరా కోసం 3 బోర్లను వినియోగిస్తున్నారు.

కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం



కాటేదాన్ చౌరస్తా రోడ్‌షోలో మంత్రి కేటీఆర్

మైలార్‌దేవ్‌పల్లి: కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ చౌరస్తాలో రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్‌కు మద్దతుగా ఆయన రోడ్‌షోలో ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్‌లో ఆధునిక డ్రైనేజీ సిస్టం, తాగునీటి కొరత లేకుండా తాగునీటిని అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకోసం సౌభాగ్యలక్ష్మి అనే కొత్త పథకం మొదలు పెట్టనున్నామన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందజేస్తామన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను నాల్గోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కేటీఆర్ కోరారు.

24 నుంచి సీబీఐటీలో అంతర్జాతీయ సమావేశం

మణికొండ: సీబీఐటీ కళాశాలలో ఈనెల 24,25 తేదీల్లో వెబ్, సోషల్ మీడియాపై ఈఏఐ, స్ప్రింగర్ ఆధ్వర్యంలో రెండో అంతర్జాతీయ సమావేశం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ సీవీ నరసింహులు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఇండియన్, ఇన్నోవేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐనంపూడి సుబ్బారావు, గౌరవ అతిథులుగా టెక్నికల్ ఏపీఏసీ రీజినల్ సొల్యూషన్స్ డైరెక్టర్ శరత్‌బాబు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

888 మంది ఓటుహక్కు వినియోగం

సర్వీసు ఓటర్లతో పాటు ఫామ్–12డీ ఓటర్లు



ఓటుహక్కును వినియోగించుకున్న పోలీసు అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కును బుధవారం వినియోగించుకున్నారు. ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు క్యూలైన్‌లో నిలబడి తమ ఓటు వేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని 598 మంది బుధవారం ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. పోలింగ్ బూత్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు అధికారిని నియమించారు. ఈ ప్రక్రియను నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి మల్లయ్య పర్యవేక్షించారు.

◆ నియోజకవర్గ పరిధిలో ఫామ్–12డీ ప్రకారం 330 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో 290 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దరఖాస్తు చేసుకున్న ఆరుగురు మృతి చెందినట్లు రిటర్నింగ్ అధికారి మల్లయ్య తెలిపారు. మరో 34 మంది అధికారులు వెళ్లిన సమయంలో అందుబాటులో లేరని ఆయన తెలిపారు. రెండుసార్లు వారి చిరునామాలకు వెళ్లినా.. లేకపోవడంతో అధికారులు వెనుతిరిగారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 888 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్



భూపాల్‌గౌడ్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మరే ఇతర రాష్ట్రాల్లో లేవని దేశానికే తెలంగాణ రాష్ట్రం తలమానికంగా నిలుస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలన దక్షతతో వేలాది పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల వల్ల లబ్ధి చేకూరుతుందన్నారు. పేద, బడుగు వర్గాల ప్రజలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్నారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో సైతం తెలంగాణ ముందుందన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్‌కు ఓటు వేసి కారు గుర్తును గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.

బీఆర్ఎస్‌లోకి కార్పొరేటర్..

◆ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌కు చెందిన బీజేపీ కార్పొరేటర్ బుర్ర భూపాల్‌గౌడ్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని, నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

భారీ మెజార్టీ సాధిస్తాం..

మణికొండ: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్‌కు నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలో భారీ మెజార్టీ సాధిస్తామని పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్ యాదవ్, మణికొండ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు కావ్యశ్రీరాములు, ఎ.నవీన్‌కుమార్, పత్తి శ్రీకాంత్‌రావు, పత్తి ప్రవీణ్‌కుమార్, జి.శివారెడ్డి, గోపాల సునీత గణేష్, విజిత ప్రశాంత్‌యాదవ్, యాదమ్మ, ఉషారాణిలు పేర్కొన్నారు. బుధవారం వారు జంట మున్సిపాలిటీల పరిధిలోని పలు కాలనీలు, వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మెట్రోరైలు, గండిపేట చుట్టూ సైకిల్‌ట్రాక్, మూసీ సుందరీకరణ, వంతెనల నిర్మాణాలు చేపడతామన్నారు. పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లక్ష్మీశ్రీ, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మణికొండలో ప్రచారం నిర్వహిస్తున్న తలారి మల్లేష్, రామకృష్ణారెడ్డి

అభివృద్ధిని చూసి ఓటు వేయండి..

రాజేంద్రనగర్: బుద్వేల్ గ్రీన్ సిటీ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఓటర్లను నేరుగా కలిసి సంక్షేమ పథకాలతో జరిగిన లబ్ధిని వివరిస్తూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రకాష్‌గౌడ్ ఓటువేసే విషయాన్ని వివరించారు. నిరంతరం ప్రజా సేవచేస్తున్న ఎమ్మెల్యేకు మనం ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు ఆనుముల జాన్‌పాల్, కోరని రవీందర్, సాయిమల్లిక్, నరేష్‌యాదవ్, పుంజాల సాయి, రాజు, రజనీకాంత్, జబీన్ హుస్సేన్, పట్నం నరేష్, బండ్ల నరేష్, నందిగామ నర్సింహ, కాటి దేవేందర్, ప్రమోద్ మలాకి, పచ్చ శ్రీనివాస్, ప్రీతం రాజు, ఉమారెడ్డి, గిరి, రఘు, రాజేష్, మహేందర్, విశాల్, సురేష్, మహేల్, బంటి తదితరులున్నారు.

దళితులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాం

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ఎస్సీ కుల వర్గీకరణ చేయడానికి దేశ ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాడని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నివాసంలో సమావేశం నిర్వహించగా.. నియోజకవర్గంలోని ఎస్సీ సామాజిక వర్గం నాయకులు పాల్గొన్నారు. మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు తోకలకు పూర్తి మద్దతును ప్రకటించారు. అనంతరం తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ సామాజికవర్గం పోరాటం చేస్తూనే ఉందని, ఇప్పటి వరకు అందని ద్రాక్షల మిగిలి పోయిందన్నారు. ఈనెల 11న జరిగిన మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన విశ్వరూప మహాసభకు ప్రధానమంత్రి హాజరై ఎస్సీల వర్గీకరణ తప్పనిసరిగా పార్లమెంటులో బిల్లు పెట్టడానికి అంగీకరించడంతో ఎస్సీల ముఖాలలో వెలుగు నింపినవారయ్యారన్నారు. బీజేపీ తప్పనిసరిగా ఎస్సీ వర్గీకరణ కోసం ఇచ్చిన మాటను నెలబెట్టుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపును ఆపలేరు..

◆ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మణికొండ: రాజేంద్రనగర్‌లో బీజేపీ అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమైందని, దాన్ని ఎవరూ ఆపలేరని, ప్రజలు నిశ్శబ్ద విప్లవంగా ఓటింగ్‌లో పాల్గొంటారని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని హుడాకాలనీ ఆత్మీయ సమ్మేళనంలో మంగళవారం రాత్రి ఆయన బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీ ముఖ్యమంత్రి, ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ, ఇతర రాష్ట్రాల ఓటర్లు, మైనార్టీ మహిళలు, స్థానికంగా ఉన్న పార్టీ బలంతో తమ అభ్యర్థి గెలిచితీరుతారన్నారు. మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు బీరప్ప, సీనియర్ నాయకుడు శ్రీశైలంరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, హుడాకాలనీ ప్రజలు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో రోడ్‌షో..

శంషాబాద్: 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ భూ కబ్జాలు తప్ప ఎక్కడ అభివృద్ధి చేశాడో చూపాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. 'శంషాబాద్‌లోని సర్కారు భూములను కబ్జా చేయడానికి ఆయన చేసిన ఎత్తుగడలన్నీ ఇక్కడి ప్రజలకు తెలిసిందేనన్నారు'. సాతంరాయి, రాజీవ్‌గృహకల్ప, పాశంబండలో బుధవారం తోకల శ్రీనివాస్‌రెడ్డి రోడ్‌షోలో మాట్లాడారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, దేవేందర్, మహిపాల్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ప్రశాంత్, కౌన్సిలర్ కె. ప్రవీణ్‌గౌడ్ తదితరులున్నారు.



సాతంరాయి రోడ్‌షోలో..



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గ్రామాల్లో పోలీసుల కవాతు



శంషాబాద్ రూరల్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక పోలీసులు, సాయుధ బలగాల ఆధ్వర్యంలో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పాల్మాకుల, పెద్దషాపూర్, పెద్దతూప్ర, పెద్దషాపూర్‌తండా, మదన్‌పల్లి కొత్తతండాలోని వీధుల్లో పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు తిరుగుతూ కవాతు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ పీఎస్‌ను సందర్శించిన సీపీ



సంతోష్‌నగర్: ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య అన్నారు. బుధవారం సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఎన్నికల బందోబస్తుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా పోలీస్‌స్టేషన్ల పరిధిలో తీసుకుంటున్న చర్యలు, బందోబస్తు, అదనపు బలగాలు తదితర విషయాలపై ఆరా తీయడం జరిగిందన్నారు. ప్రస్తుతం అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయని.. ఇక ముందు కూడా కొనసాగుతాయన్నారు. సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్ శివచంద్ర పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు ప్రాధాన్యం

విజయనగర్‌కాలనీ: మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు ఎంఐఎం పార్టీ ప్రాధాన్యమిస్తుందని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బుధవారం మాసబ్‌ట్యాంక్, చింతలబస్తీ, వీర్‌నగర్, సైఫాబాద్ తదితర ప్రాంతాల్లో నాంపల్లి ఎంఐఎం అభ్యర్థి మాజీద్‌హుస్సేన్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కులమతాలకు అతీతంగా ఎంఐఎం పార్టీ బస్తీలు, కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. మాజీద్ హుస్సేన్‌ను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. గత రెండు దశాబ్దాల నుంచి ఎంఐఎం పార్టీ నాంపల్లి నియోజకవర్గంలో ప్రజాసేవకే అంకితమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనన్నారు. నాంపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే గత ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ మేరాజ్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తిచేశారని, ఇంకా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలంటే ఎంఐఎం పార్టీకే సాధ్యపడుతుందని వివరించారు. ఏరియా ప్రెసిడెంట్ అహ్మద్ మాజీద్ రజ్వీ, మహ్మద్ అతిక్, మహ్మద్ మాజీద్ భాయ్, అశ్వాక్ అహ్మద్, మహ్మద్ మహమూద్, మహ్మద్ జంషీద్ పాల్గొన్నారు.

భవనం పైనుంచి కంకర రాళ్లుపడి వ్యక్తికి గాయాలు

నాంపల్లి: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిపై నిర్మాణంలో ఉన్న ఐదవ అంతస్తు పై నుంచి కంకర రాళ్లు పడి గాయాలు అయ్యాయి. ఈ ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..బజార్‌ఘాట్‌కు చెందిన సర్వర్ (49) ఫర్నిచర్ దుకాణంలో పనిచేస్తాడు. బుధవారం సాయంత్రం నాంపల్లి ఏరియా ఆస్పత్రి మీదుగా తన ద్విచక్రవాహనంపై దుకాణానికి వెళ్తుండగా నిర్మాణంలో ఉన్న ఐదవ అంతస్తుపై నుంచి కంకర రాళ్లు పడ్డాయి. దీంతో అతడికి ముఖం, ముక్కుకు గాయాలయ్యాయి. బాధితుడు హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నరేందర్ కృషి



మణికొండ చిత్రపురి కాలనీలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మణికొండ: మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ ప్రాంత అభివృద్ధికి కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ ప్రజానాయకుడని కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపల్ ఉపాధ్యక్షుడు మాల్యాద్రినాయుడు, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్‌లు అన్నారు. బుధవారం వారు జంట మున్సిపాలిటీల పరిధిలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థులే అత్యధికంగా గెలుస్తారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. అన్ని వర్గాలకు అవసరమైన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిందని, వాటిని ఇంటింటికి వివరిస్తున్నారు. నాయకులు కిరణ్‌కుమార్, వినోద్, రాము, వెంకటేష్, వేణుగౌడ్, డాక్టర్ ప్రభావతి, సాయిరెడ్డి, యాలాల నరేష్, బి.రాజు తదితరులతో పాటు పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గౌలిదొడ్డి నుంచి రోడ్ షో..

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గౌలిదొడ్డి నుంచి ఉదయం 8 గంటలకు ప్రచారం ప్రారంభించి వట్టినాగులపల్లి, ఖానాపూర్, గండిపేట, కోకాపేట, మంచిరేవులల మీదుగా రాత్రికి నార్సింగి వరకు రోడ్‌షో నిర్వహిస్తారని పార్టీ నాయకులు తెలిపారు. ఈ రోడ్‌షోలో అన్ని గ్రామాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

దుప్కి పున్నమి జాతరకు తరలిరండి

లంగర్‌హౌస్: త్రివేణి సంగం దుప్కి పున్నమి జాతరలో భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని త్రివేణి సంగం రాంచంద్ర జీ మఠం పీఠాధిపతి రాహుల్ దాస్ బాబా బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ..ఈ నెల 24 నుండి కార్తీక ముక్తి స్నానాల జాతర ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో భాగంగా 24న సాయంత్రం తులసీ నారాయణుల వివాహం, జ్వాలా తోరణంతో పాటు 27న తెల్లవారుజామున 2 గంటలకు స్వామి వారికి నదీ స్నానం, రథోత్సవంతో ముక్తి స్నానాలు ప్రారంభం కానున్నాయన్నారు.

గోమాతకు పూజలు



జియాగూడ: గోమాత ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలుపొందుతానని గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. బుధవారం జియాగూడలోని సమర్థ కామధేను గోషాలలో గోమాతకు పూజలు నిర్వహించి గోగ్రాస సేవ చేశారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ సీఎం కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలు తన గెలుపునకు దోహదపడుతాయన్నారు.

విద్యుత్ బిల్లు వసూలుకు వెళ్లిన సిబ్బందిపై దాడి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

పోలీసుల అదుపులో నిందితులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధి కాటేదాన్ సెక్షన్‌లో శాస్త్రీపురం విద్యుత్ బిల్లులు వసూలు కోసం వెళ్లిన సిబ్బందిపై దాడి చేసిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మధు, గగన్‌మహాడ్ విద్యుత్ సబ్ డివిజన్ ఏడీఈ ఈశ్వర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. శాస్త్రీపురంలో రియాజ్ అహ్మద్ తన ఇంటిని రియాజ్ అహ్మద్‌కు అద్దెకు ఇచ్చాడు. కరెంటు బిల్లు రూ.13,601 బకాయిలు ఉన్నాయి. ఉదయం విద్యుత్ సిబ్బంది నేమతుల్లా, యామస్‌లు రియాజ్ అహ్మద్ ఇంటికి కరెంటు బిల్లు వసూలు చేసేందుకు వెళ్లారు. అద్దెకు ఉంటున్న వారి కుమారులు బిల్లు కట్టకుండా సిబ్బందిపై దాడి చేశారు. దీంతో విద్యుత్ విజిలెన్స్ ఎస్సై సత్యనారాయణ, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఈశ్వరప్రసాద్, విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం ప్రధాన కార్యదర్శి అజీమ్‌లు విద్యుత్ సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. విద్యుత్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు.